# విపశ్యన మాసపత్రిక

VOLUME:29 NO - 20 1 NOVEMBER, 2019

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70

**"ధర్మవాణి"**

*చతున్నం భిక్ఖవే, అరియసచ్చానం అనునుబోధా అప్పటివేధా !*
*ఏవమిదం దీఘమద్ధానం సన్ధావితం సంసరితం మమఞ్చేవ తుమ్హాకఞ్చ!!*

*– మహావగ్గపాళీ – మహాపరినిబ్బానసుత్తం– 155*

భిక్షువులారా! నాలుగు ఆర్య సత్యాలను పూర్తిగా తెలుసుకోకపోవటం మరియు మన అనుభవ స్థాయిలో లోతుల వరకూ చీల్చుకుంటూ వాటిని స్వయంగా సాక్షాత్కారం చేసుకోని కారణంగానే, ఎంతో ఎక్కువ కాలం నుండి నేను, నీవు ఈ సంసారచక్రంలోకి పదే పదే రావటం, పోవటం, పరిగెత్తటం, పరిగెత్తుతూనే ఉండటం జరుగుతోంది.

## విపశ్యనా సాధన స్వర్ణ జయంతి సందర్భంగా పూజ్య గురూజీ పట్ల కృతజ్ఞతను ప్రకటించుకునే సదవకాశం

**(మూలం: నవంబర్ 24, 2018 న వెలువడిన హిందీ మాసపత్రిక )**

*విపశ్యనా సాధన మళ్లీ జీవం పుంజుకుని 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఒక సంవత్సరం పాటు – అనగా 3 జూలై 2018 నుండి 2 జూలై 2019 వరకూ గ్లోబల్ పగోడాలో, ప్రతిరోజూ ఒక్కరోజు శిబిరాలు క్రమబద్ధంగా నిర్వహించబడ్డాయి. ఈ శిబిరాలు సాధకుల రోజువారీ సాధనలు పుష్టి చేయటానికి సహాయ పడగలవని నిర్వహించారు. సాధకులకు ఏరోజు సమయం దొరికితే, ఆ రోజు ఈ శిబిరాల నుండి ప్రయోజనం పొందారు. వీటితో సాధకుల సాధనలో కూడా నిరంతరత మరియు క్రమబద్ధత వచ్చి, ఆ తరువాత అలాంటి వారి నుండి ప్రేరణ పొంది, ఇతరులలో సద్ధర్మం పట్ల ఆసక్తి కలిగితే, వీలయినంత ఎక్కువ మంది శిబిరాల్లో పాల్గొని, తమ మేలు చేకూర్చుకుంటారు. ఇదే విధంగా, ఇతర ప్రాంతాల్లో కూడా, రోజువారీ సాధన, సామూహిక సాధన మరియు ఒక్కరోజు శిబిరాల ద్వారా ఈ విద్యలోని వ్యవహారిక పక్షాన్ని అంటే సాధన యొక్క ఆచరణను దృఢపరుచుకోడానికే ఈ శిబిరాలు నిర్వహించబడ్డాయి. ఇదే పూజ్య గురుదేవుల పట్ల మనం చూపించే అసలైన శ్రద్ధాంజలి, నిజమైన కృతజ్ఞత అవుతుంది.*

*విశ్వ విపశ్యనాచార్యులు పూజ్య శ్రీ సత్యనారాయణ గోయంకా గారు శుద్ధ ధర్మ సంపర్కంలోకి రాకముందు జరిగిన సంఘటనలు మరియు బాల్యం నుండి యౌవన దశ వరకూ వారిలోని భక్తి భావాన్ని గురించి ఎలాంటి భ్రమా కలగకూడదని, ఇంకా ఇలాంటి వ్యక్తి కూడా ఏ విధంగా మారగలడోనని తెలుసుకొని వారి నుండి ప్రేరణ పొందాలనే ఉద్దేశ్యంతో, వారి ఈ సంక్షిప్త జీవిత పరిచయం, వారి మాటల్లోనే – **నాలుగవ భాగం.***

### ఆర్య సమాజంతో సంపర్కము

**(గత సంచిక తరువాయి భాగం)....** పద్నాలుగు సంవత్సరాల వయసు పూర్తవుతుండగా నేను ఆర్య సమాజ సంపర్కంలోకి వచ్చాను. ఆర్య సమాజం వారు మా ఇంటికి సమీపంలో ఒక కొత్త మందిరాన్ని నిర్మించారు. అందులో ఈ మధ్యనే భారతదేశం నుండి వచ్చిన పండిత మంగళదేవ శాస్త్రిగారు పురోహితులుగా నియమించబడ్డారు. వారి వయసు 60 సంవత్సరాలకు పైబడినట్లు అనిపించకపోయినా, వారి తల వెంట్రుకలన్నీ తెల్లబడిపోయి, నోట్లో ఒక్క పన్ను కూడా ఉండేది కాదు. ఈ స్థితిలో కూడా వారి శరీరం దృఢంగా ఉండేది, వారి ముఖం ఎంతో ఆకర్షణీయంగా అనిపించేది. అత్యంత స్నేహ స్వభావం, ఏ అంశాన్నైనా ఎంతో సరళమైన మాటల్లో వివరించే కళ మరియు వైదిక సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేయటం – వారిలోని ఈ ప్రత్యేకతలు నన్ను మాండలేలోని ఆర్య సమాజంతో ముడిపడేలా చేశాయి. నాకు 18 సంవత్సరాల వయసు వచ్చే వరకూ, అంటే జపాన్ మహా యుద్ధం ఆరంభం కావటంతో మయన్మార్ వదిలి వెళ్ళేంత వరకూ ఈ పరిచయం కొనసాగింది.

వారు మాండలేలో స్థానిక కిషోర, నవయువకుల్లో ఒక కొత్త చేతనను కలిగించారు. "ఆర్య–బాల–సేన"ను స్థాపించి, దాని నేతృత్వాన్ని నాకు అప్పగించారు. మేము ప్రతి ఆదివారం సమావేశమై, బుద్ధిపరమైన చర్చలు చేసి, శాస్త్రి గారి నిర్దేశనంలో ఆసనాలు, ప్రాణాయామాలు నేర్చుకుని కర్రసాము, కవాతులు నడపటం నేర్చుకునే వాళ్ళం. ఇవన్నీ నాకెంతో నచ్చేవి. ఇవి కాకుండా, వారు ఆర్య సమాజపు సిద్ధాంతాలను ఎంతో ప్రేమగా వివరించేవారు. అత్యంత బుద్ధిశాలి అయిన మహర్షి దయానంద సరస్వతి గారి ఆలోచనలతో నేను ఎంతగానో ప్రభావితం అయ్యాను. కానీ, వారి శిక్షణను అనుసరించి నిర్గుణ నిరాకార ఉపాసకుడిని కాలేకపోయాను. ఎందుకంటే, సగుణ సాకారుడైన భగవంతుని పట్ల నాలో ఉన్న భక్తి ప్రగాఢమై, దృఢపడి పోయింది. దానిని వదిలేయటం నాకెంతో అసంభవంగా అనిపించింది. అయినప్పటికీ ఆర్య సమాజంలో, **"జయ జగదీశ హరే"** అనే హారతి పాట పాడినప్పుడు అందులో – **"కరుణా హస్త్ ఉఠావో, శరణ్ పఢా తేరే"** (కరుణా హస్తాలతో దీవించు, నీ శరణులోకి వచ్చాను) అనే పంక్తి వినేవాడిని. ఇందులో ఈశ్వరుని సాకార రూపం ఉంది. సగుణ రూపాన్ని కలిగి ఉండకపోతే వారు తన చేతితో ఎలా దీవిస్తారు, తన శరణుజొచ్చిన వాళ్ల పట్ల కరుణను ఎలా కలిగి ఉంటారు? అని నాకు అనిపించేది, కానీ నేను ఈ ప్రశ్నలను ఆర్య సమాజ గురువు పండిత మంగళదేవ శాస్త్రిగారి వద్ద అడగటానికి

ధైర్యం చేయలేకపోయేవాడిని. నేనయితే నిర్గుణ నిరాకార భక్తిని గురించిన చింతన–మననలు చేసినప్పటికీ, సగుణ సాకారమైనదే భక్తి అనే నిర్ణయానికి వచ్చేశాను. ఆర్య సమాజంలో ఒక వారం రోజుల పాటు నడిచే హోమాలు జరిగినప్పుడు ఆ అగ్నితో పరిమళించిన పొగతో ప్రార్థనా మందిరంలోని వాయుమండలమంతా సువాసనా భరితమయ్యేది. అది నాకెంతో ఇష్టంగా అనిపించేది. వైదిక మంత్రాలు అంతగా అర్థం కాని కారణంగా, వాటి పట్ల ఎక్కువగా ఆకర్షితుడిని కాలేకపోయాను. కానీ ముగింపులో జరిగే "శాంతిపఠనం" అర్థమయ్యేది, మనసుకెంతో ప్రియంగా అనిపించేది. అప్పుడప్పుడూ నేను ఇంట్లో కూడా ఈ శాంతి పఠనాన్ని ఉచ్ఛరిస్తూ మనసును ఆనందంతో నింపుకునేవాడిని.

ఆర్య సమాజంలో మా గురువు గారి సంసర్గంలోకి రావటంతో కలిగిన ప్రయోజనం ఏమిటంటే ఏ విషయాన్నీ అంధ విశ్వాసంతో అంగీకరించకుండా, దానిని గురించిన చింతన, మననలు చేసే ఒక కొత్త కోణం నాలో తెరుచుకుంది. దానితో పాటుగా "శాస్త్ర – వచన – ప్రమాణాల" గుడ్డినమ్మకాల పొరలతో రచింపబడిన ఎన్నో పౌరాణిక పుస్తకాలను అంధ విశ్వాసంతో స్వీకరించకూడదు అని కూడా అర్థమయింది. కొద్దిమంది, వారి గ్రంథాలను అందరూ నమ్మేలా, వారి స్వార్థాన్ని సిద్ధించుకునేలా ఎంతో చాకచక్యంగా ఎన్నో ధర్మగ్రంథాలను రచించారు అని తెలుసుకుని ఎంతో ఆశ్చర్యపోయాను.

అలాగే, మన ధర్మగ్రంథాల్లో నవరణల రూపంలో సమయానుగుణంగా అసత్యాలను, భ్రమింపచేసే మరియు స్వీకరింపదగని ఎన్నో విషయాలను జోడిస్తూ పోవటం జరిగింది అని తెలుసుకోవటం కూడా నాకు ఎంతో కొత్త విషయం.

ఆర్య సమాజపు "సమాజోద్ధారణ" శిక్షణ నా మనసుపై ఎంతో లోతైన ప్రభావాన్ని వేసింది. 14 నుండి 16 సంవత్సరాల వయసు మధ్యలో నా తోటి కిషోర, నవయువక మిత్రులతో కలిసి సమాజంలోని బాల్య వివాహం, వృద్ధ వివాహం మరియు అసమతుల్య వివాహాలను ఆపటానికి విఫల ప్రయత్నాలు చేశాము. అదే విధంగా ఒక వితంతు వివాహం చేయించే ప్రయత్నం కూడా విఫలమయింది. అలాగే శుద్ధీకరణ మరియు శూద్రులకు యజ్ఞోపవీతం వేయించాలనే ఉత్సాహం కూడా సఫలం కాలేకపోయింది. అయినప్పటికీ, సమాజోద్ధారణ పట్ల జాగృతమైన దృఢమైన భావన, భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతూ వచ్చింది.

నేను మహర్షి దయానంద్ సరస్వతి గారి ప్రముఖ రచన "**సత్యార్థ్ ప్రకాశ్**" కూడా చదివాను. ఆ కారణంగా చింతన చేసే ఒక కొత్త కోణం నాలో తెరుచుకున్నది. ఆ పడుచు ప్రాయంలో వాటిని పూర్తిగా అర్థం చేసుకున్నానని చెప్పలేకపోయినా, బుద్ధుని వర్ణనలో ఎన్నో లోపాలున్నాయని మాత్రం తెలుసుకున్నాను. బుద్ధుడు ఆత్మ, పరమాత్మల అస్తిత్వాన్ని స్వీకరించకుండా, ప్రజలను నాస్తికులను చేశారు. వారు వేదాలను నిందించారు. బహుశా ఈ కారణంగానే వారి మార్గంలో ప్రయాణం చేసే వ్యక్తి సద్గతి పొందకుండా అధోగతి పొందుతాడు అని అర్థమయ్యింది. "**సత్యార్థ్ ప్రకాశ్**" లో బుద్ధుని బోధనలలోని మరెన్నో లోపాలను ప్రస్తావించారు. వాటిని ఆ వయసులో పూర్తిగా అర్థం చేసుకునే సామర్థ్యం నాకు లేకున్నది. అయితే బుద్ధుని బోధనలు దోషాలతో కూడుకున్నవి అని మాత్రం అర్థమయింది. దీనితో మా బావగారి పూర్వ కథనంతో నా మనసుపై పడిన ప్రభావం మరింత బలపడుతూ పోయింది.

1942వ సంవత్సరంలో యుద్ధం ఆరంభం కావటంతో మయన్మార్‌ను వదిలి భారతదేశానికి వచ్చాక, యౌవనంలోకి అడుగుపెడుతూ బుద్ధుని బోధనల్లో ఎన్నో లోటుపాట్లు ఉన్నాయని, వారు ఎంతో దుఃఖవాది అని, దాని కారణంగా దేశంలో నిరాశ, నిరుత్సాహాల వాతావరణం ఉదయించింది అని, వారి బోధనల్లో ప్రపంచంలోని క్షణభంగురతకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది అని అర్థం చేసుకున్నాను. ఈ అనిత్య దర్శనంలో నిత్యమైన, శాశ్వతమైన, మార్పు చెందని వాటి పట్ల ఎక్కడా ప్రస్తావన కూడా చేయలేదు. ఈ సంసార చక్రం నుండి బయటపడటానికి ఎటువంటి లక్ష్యమూ, ఎటువంటి మార్గదర్శకమూ లేవు. ఆయన బోధనలన్నీ నకారాత్మకంగా, నిరాశాజనకంగానే ఉన్నాయి. మన ఉజ్వల భవిష్యత్తు పట్ల ఆశాజనకంగా ఉండటానికి ఎక్కడా ఎటువంటి ఫలవంతమైన ఉపదేశం ఏదీ లేదు అని గమనించాను.

"వారు విరక్తివాదులు కాబట్టి, వారి శిక్షణ గృహత్యాగులకైతే మంచిదే కానీ, గృహస్థులకు ఏ విధంగానూ ఉపయోగపడనిది. వారు కరుణతో నిండి ఉండేవారు, కాబట్టి అహింసను బోధించటం వలన వారి బోధన మన దేశాన్ని బలహీనంగా తయారుచేసింది. అశోకుని వంటి సంగ్రామ వీరుడు బుద్ధుని బోధనల మార్గంలో పడి, తన కత్తిని త్యజించారు, యుద్ధాన్నుండి విముఖులయ్యారు. దాని దుష్ప్రభావం భవిష్యత్తుపై పడింది. దేశం పైకి ఎన్నోసార్లు విదేశీయుల దండయాత్రలు జరగటం వలన మనం బానిసత్వపు సంకెళ్ళలో చిక్కుకుపోతూ వచ్చాం. బుద్ధుని బోధనల కారణంగానే ప్రజల్లో చురుకుదనం నశించిపోయి, జీవితం ఎంతో నిరాశగా, నిస్సారంగా అనిపించటం మొదలయింది. అంతటా శూన్యమే శూన్యం. జీవితం పట్ల ప్రజల్లో ఎలాంటి ఉల్లాసము, ఉత్సాహము, ఆనందము మిగలనే లేదు. ఇది దేశానికెంతో హానికరంగా మారింది." ఆ రోజుల్లో ఇలాంటి ఎన్నో మాటలు వింటూ, చదువుతూ ఉండేవాడిని, వాటితో మనసు మీద ఎంతో లోతైన ప్రభావం పడుతూ పోయింది. అలా బుద్ధుని బోధనల పట్ల మనసులో విముఖత దృఢపడుతూ పోయింది.

అయితే మా పూర్వీకుల వైదిక పరంపర పట్ల ఎంతో లోతైన గౌరవము, చెదరని శ్రద్ధ ఉన్న కారణంగా, "భగవానుని వాణిలో ఎన్నో లోపాలు ఉన్నప్పటికీ దానిలో ఎన్నో మంచి విషయాలు కూడా తప్పకుండా ఉండే ఉంటాయి, కాబట్టే వారికి విశ్వంలో ఇంత గౌరవం లభించింది." అనే ఆలోచన కూడా మనసు లోతుల్లో నాటుకుపోతుంది. కానీ, ఆ మంచి విషయాలు కూడా మా వైదిక పరంపర నుండే తీసుకోబడ్డాయి; అహింస, త్యాగాలకు అత్యధిక మహత్యం ఇవ్వటంతో పాటు ఆ కాలపు సమాజంలో చేరిన కొన్ని తప్పులను దూరం చేయటం మినహాయించి వారు మన కొరకు కొత్తగా ఇతర బోధనలేవీ ఇవ్వలేదు. అని నేను అనుకునేవాడిని.

రంగూన్‌లో ఉంటూ దాదాపు 25 సంవత్సరాల యౌవన స్థితిలో జీవితంలోని ఎన్నో రంగాల్లో ఎంతో సఫలత పొందిన కారణంగా, నా కలుపుగోలు స్వభావం కారణంగా, నేను అక్కడి ధార్మిక పెద్దలు, సాంస్కృతిక, శిక్షణా సంబంధ మరియు రాజకీయ నాయకుల పరిచయంలోకి వచ్చాను, ఎంతో మందికి అత్యంత సన్నిహితుడిని కూడా అయ్యాను. అప్పుడప్పుడూ మాటల మధ్యలో నా అవివేకం కారణంగా నేను వ్యక్తపరిచే విషయాలు – నేనెంతో వినయంగా వివరించినప్పటికీ – ఎదుటి వారి మనసును నొప్పింపచేసేవి. నాకున్న పరిజ్ఞానంతో వారి గాయపడ్డ మనసును అర్థం చేసుకుని, వారితో ప్రేమతో నిండిన రెండు

మాటలు మాట్లాడేవాడిని. కానీ, వారికి మన వైదిక పరంపర గురించి ఏమీ తెలియదు కాబట్టే నా మాటలకు నొచ్చుకున్నారు అని మనసులో అనుకునేవాడిని. నిజానికి వేదాల్లో విశ్వవిజ్ఞానమంతా నిండి ఉంది; ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరు ఏ జ్ఞానాన్ని ప్రస్తావించినా, దాని పుట్టుక అయితే వేదాల్లోనే దొరుకుతుంది అనుకునేవాడిని. కానీ అప్పటికి నేను ఏ వేదంలోనూ ఏ ఒక్క పేజీ కూడా చదవనే లేదు. అంతా నమ్మకమే, ఎక్కడో విన్న మాటలనే ఆధారం చేసుకునేవాడిని.

ఆ రోజుల్లోని ఒక సంఘటన – స్థానిక ఇంగ్లీషు పత్రికల్లో "క్వింటెసెన్స్ ఆఫ్ హిందూఇజం" అనే అంశం మీద నా ప్రవచనం ఉంటుంది అనే సూచన ప్రచురింపబడింది. సాహిత్యము, సంస్కృతీ మరియు ధార్మిక అంశాల మీద నేను ఇచ్చే సార్వజనీన ప్రవచనాలు, సాధారణంగా హిందీలోనే ఉండేవి. ఇంగ్లీషు పట్ల నాకున్న పరిజ్ఞానం పరిమితమైనది. దానితో, హిందీ తెలియని నా బర్మీ మిత్రులు, ఈ ప్రవచనాల నుండి ఎటువంటి ప్రయోజనం పొందేవారు కాదు. కానీ ఈ సూచనను ఇంగ్లీషు పత్రికల్లో ప్రచురించిన వారు, ప్రవచనం హిందీలో ఉంటుంది అని రాయటం మరిచిపోయారు. దానితో, నా ప్రవచనం ఇంగ్లీషులో ఉంటుంది అనే భ్రాంతి వ్యాపించింది. నా దగ్గరి బర్మీ మిత్రులు ముగ్గురు, నలుగురు నా ప్రవచనాన్ని వినటానికి హాజరయ్యారు. వారిలో "ఊ తా మ్యా" మినహా ఎవరికీ హింది అర్థం కాదు. కానీ నేనయితే హిందీలో మాట్లాడాలి కాబట్టి హిందీలోనే మాట్లాడాను. హిందీ అర్థం కాని వాళ్ళు నిరాశచెందారు.

ప్రవచనం ముగిసాక, ఆ నలుగురినీ మా ఇంటికి తీసుకువెళ్ళి, భోజన సమయంలో వారికి నా హిందీ ప్రవచన సారాంశాన్ని వివరించాలి అనే ఉద్దేశ్యంతో వారిని ఇంటికి తీసుకువెళ్లాను. భోజన సమయంలో, హిందూ ధర్మ సారమంతా గీతయే అని, గీతా సారం స్థితప్రజ్ఞతా బోధన అని వారికి వివరించాను. నా ప్రవచనంలో నేను చెప్పిన స్థితప్రజ్ఞతను గురించిన విశ్లేషణాత్మక వర్ణనను కూడా వారికి వివరించాను. దానికి బదులుగా, "ఇవన్నీ బుద్ధ భగవానుడు వర్ణించిన అర్హంత గుణాలు" అని ఊ తా మ్యా గారు చెప్పారు. దానికి నేను, "నిజానికి బుద్ధ భగవానుడు బోధించినవన్నీ మా వేదాల నుండి లేదా గీత నుండి తీసుకుని చెప్పినవే కాబట్టి వారు వివరించిన అర్హంత గుణాలు గీతలోని స్థితప్రజ్ఞ గుణాలకు సరిపోయి ఉన్నాయి. ఇందులో ఆశ్చర్యమేమీ లేదు." అని గర్వంగా చెప్పాను. ఈ మాటలు నా బర్మీ మిత్రులకు నచ్చలేదు. ఊ తా మ్యా గారు పాళీ, సంస్కృతము, బర్మీ మరియు ఇంగ్లీషు భాషల్లో పేరుమోసిన విద్వాంసుడు. అతనికి హిందీ కూడా బాగా తెలుసు. అతను భారతదేశంలోని ఏదో విశ్వవిద్యాలయం నుండి ఉన్నత విద్యనభ్యసించారు. అప్పటి బర్మా ప్రభుత్వపు సాంస్కృతిక విభాగానికి వారు ప్రముఖ అధికారిగా ఉండేవారు. నేను చెప్పిన దానిలో నిజం లేదు అని వారు చెప్పారు. నేను బుద్ధవాణిని మరియు మా పరంపరలోని ధర్మ గ్రంథాలను నిష్పక్షపాతంగా చదివిన రోజు నా నమ్మకం సరైనది కాదు అని నాకు అర్థమవుతుంది అని చెప్పారు. మా మధ్య ఎంతో దృఢమైన మైత్రీ బంధం ఉన్న కారణంగా, ఇటువంటి అభిప్రాయ బేధాలు ఉన్నప్పటికీ మా మైత్రిలో ఎటువంటి లోటు రాలేదు. కానీ నా నమ్మకాలన్నుండి ఏ కొద్దిగానయినా బయటపడటానికి కూడా నేను తయారుగాలేను.

శ్రద్ధావంతులైన భదంత ఆనంద కౌసల్యాయన్ గారు మా ఇంటికి తరచూ అతిథిగా వస్తూ బస చేసేవారు. బర్మాలో హిందీ ప్రచార కార్యంలో వారి నుండి నాకెంతో సహాయం లభించింది. ఈ కారణంగా నేను వారికెంతో ఋణపడి ఉండేవాడిని. అలాగే గృహస్థ ధర్మాన్ని పాటిస్తూ, వారికి అతిథ్యం కల్పించటంలో నేను ఎటువంటి లోటు రానివ్వలేదు. కానీ వారు బుద్ధుని బోధనలను గురించి చర్చ మొదలుపెట్టగానే నేను మొహం చాటేసేవాడిని. ఎంతో వ్యవహార కౌశల్యం కలవారు కాబట్టి వారు అర్థం చేసుకుని, తన ఉత్తమ స్వభావంతో సరళంగానే చర్చా విషయాన్ని మార్చేసేవారు.

ఒక రోజు ఇంట్లో హిందీ ప్రచారానికి సంబంధించిన చర్చ ఏదో జరుగుతున్నది. బుద్ధుడు అర్హంత వ్యాఖ్యను గీత నుంచి తీసుకుని చేశాడు అన్న నా మాటలు సరైనవి కావు అని చెప్పిన నా బర్మీ మిత్రుడు ఊ తా మ్యా గారు కూడా అక్కడే ఉన్నారు. ఆయన ఆకస్మాత్తుగా ఈ విషయాన్ని మరొక్కసారి ప్రస్తావించారు. ఆనంద్ గారు కూడా వారి తరవునే మాట్లాడుతూ, "నిజానికి సత్యమేమిటంటే, బుద్ధుని కాలానికి ఎన్నో ఏళ్ళ తరువాతనే గీతా రచన జరిగింది. అది బుద్ధుని బోధనలతో ప్రభావితమయింది." అని చెప్పారు. వారు అలా చెప్పటంతో నా మనసుకెంత లోతైన గాయం అయిందో నేను వర్ణించలేను. ఆ తరువాత వారు, "నిజానికి, బుద్ధ ధర్మాన్ని వైదిక ధర్మం యొక్క సంతానం అనటం అసత్యం. నేటి హిందూ ధర్మమే బౌద్ధ ధర్మం యొక్క సంతానం" అని చెప్పటంతో నా మనసుకు మరింత లోతైన గాయం అయింది. ఊ తా మ్యా గారు కూడా దానిని అంగీకరిస్తూ తల ఊపారు. నేను నిశ్శబ్దంగా ఉండిపోయాను. కానీ నేనెంతగానో నొచ్చుకున్నానని వారిద్దరికీ అర్థమయింది. బౌద్ధ ధర్మ సాంప్రదాయ శిక్షణ కారణంగా వారిద్దరూ ఎంతగానో భ్రమలో ఉన్నారు అని నాకు అనిపించింది. "అయిదు వేల సంవత్సరాల క్రితం కురుక్షేత్ర యుద్ధంలో కృష్ణ భగవానుడు అర్జునునికి ఇచ్చిన గీతోపదేశము, రెండు వేలా అయిదు వందల సంవత్సరాల తరువాత వచ్చిన బుద్ధవాణితో ఎలా ప్రభావితమైంది! నిజమేమిటంటే, బుద్ధుడే పురాతన గీతావాణి నుండి ప్రభావితుడయ్యాడు. నేటి హిందూ ధర్మం, బౌద్ధ ధర్మం యొక్క సంతానం అని చెప్పటం అంతకంటే పచ్చి అబద్ధం." అని నా అభిప్రాయం. కాని అది వివాదాలకు తగిన సమయం కాదు. మౌనం వహించటమే మంచిది అనిపించింది.

అయినా శ్రద్ధావంతుడైన ఆనంద్ గారితో నాకున్న సంబంధాలు ఎప్పటికీ మధురంగానే నిలిచి ఉండేవి. బుద్ధుడు మరియు వారి బోధనల పట్ల వారితో ఎప్పుడూ అంత వివరంగా చర్చ జరిగేది కాదు. ఒక్కసారి వారిని నేను విమానాశ్రయంలో విడిచిపెట్టటానికి వెళ్ళినప్పుడు మాత్రమే చర్చ జరిగింది. అక్కడికి వెళ్ళాక, విమానం మరో రెండు గంటల తరువాత బయలుదేరుతుంది అని తెలిసింది. దానితో అక్కడే నిరీక్షిస్తూ కూర్చున్నాము. మాటల మధ్యలో వారు, బుద్ధ భగవానుని జీవిత అంతిమ క్షణాలను గురించి చర్చించటం మొదలుపెట్టి, ఏవిధంగా ఒక ముముక్షువు వారిని కలిసి, వారి నుండి ధర్మాన్ని నేర్చుకోవటానికి వచ్చారో వివరించారు. "భగవానుని సేవక (ఉపస్థాక) భిక్షువు ఆనందుడు ఆయనను ఆపి, భగవానుని విశ్రాంతి తీసుకోనివ్వమని, ఇది ఉపదేశాలిచ్చే సమయం కాదు అని చెప్పినప్పటికీ, అతను కోరుతూనే ఉన్నాడు. మహాపరినిర్వాణ సమయం సమీపిస్తున్నది. భగవానుని మనసులో అనంత కరుణ మేల్కొని "అతనిని రానివ్వు, అతను యోగ్యపాత్రుడు, ధర్మాన్ని నేర్చుకుంటే అతనికి మంచి జరుగుతుంది" అని ఆనందునికి చెప్పారు. అలా వారి జీవితపు అంతిమ క్షణాల్లో కూడా కృపతో ఆ ముముక్షువుకు ధర్మ బోధచేశారు,

ముక్తి మార్గాన్ని చూపించారు. బుద్ధ భగవానుడు అంతటి కరుణా సాగరుడు." అని వివరించారు. నేనెంతో ఉద్విగ్న హృదయం కలిగి ఉండేవాడిని. బుద్ధుని పట్ల నాలో ఉన్న శ్రద్ధ కూడా తక్కువేమీ కాదు. ఆనంద్ గారి నుండి ఈ కరుణాపూరిత గాథను వింటూ వింటూ నా హృదయం కరిగిపోయింది. కళ్ళ నుండి అశ్రుధార ప్రవహించటం మొదలయింది. భగవానుని అనంత కరుణ పట్ల నా మనసులో ఎప్పుడూ అణువంత సందేహం కూడా ఉండేది కాదు.

నా హృదయం కరిగిపోవటాన్ని గమనించిన ఆనంద్‌గారు వెళుతూ వెళుతూ నాకు ధమ్మపద యొక్క ప్రతిని ఇచ్చి వెళ్ళారు. అది కొన్ని సంవత్సరాల వరకూ నా టేబుల్ పైననే పడి ఉన్నది. కానీ నేను ఆ పుస్తకం నుండి ఒక్క పేజీ కూడా చదవనేలేదు. "బుద్ధుని బోధనలలో తప్పకుండా ఎక్కడో ఏదో లోపమున్నది, అది మనల్ని తప్పు దారిలోకి తీసుకువెళుతుంది. లేకపోతే ఆదిశంకరాచార్య వంటి ప్రముఖ విద్వాంసుడు వాటిని భారతదేశం నుండి ఎందుకు బహిష్కరిస్తారు? ఇప్పటి వరకూ అర్థం చేసుకున్న దాని ప్రకారం బుద్ధుడు మనకు పూజనీయుడే కానీ వారి బోధనలు మాత్రం గ్రహింపదగినవి కానే కావు.'' అని అనుకునేవాడిని. చిన్న వయసులో మనసుకు అల్లుకున్న లేపనాలు ఎంతో దృఢంగా ఉంటాయి.

– తరువాయి భాగం వచ్చే సంచికలో.

– ఆత్మకథన్ 2 నుండి గ్రహింపబడినది.

## విశ్వ విపశ్యనా పగోడాలో
## విపశ్యనా సాధన స్వర్ణ జయంతి ముగింపు వేడుకలు

మీకందరికీ తెలుసు, విపశ్యనా సాధన 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహింపబడుతూ వచ్చాయి. ఈ క్రమంలోనే ఈ సంవత్సర ముగింపున, అంటే 2019 డిసెంబర్ 15, 16 తేదిల్లో విశ్వ విపశ్యనా పగోడా, ముంబయి పరిసరాల్లో ఒక బృహత్ కార్యక్రమం ఏర్పాటు చేయబడుతోంది.

ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం ఏమిటంటే, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విపశ్యనా ధ్యాన సాధకులను ఒక చోటుకు చేర్చి, సామూహిక సాధన, మైత్రీ సాధన చేయించి ధర్మసాధనను బలోపేత చేయించటం, అలాగే గత యాభై సంవత్సరాల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని, రాబోయే యాభై సంవత్సరాలకు తగిన ప్రణాళికలను రూపొందించుకోవటం. ఈ రెండు రోజుల కార్యక్రమంలో విపశ్యనా గురించి, గౌతమ బుద్ధుని బోధనలను గురించిన చర్చ జరుగుతుంది. దానితో పాటుగా ధర్మకార్యంలో పూజ్య గురూజీ గారి సాన్నిధ్యంలో పనిచేసిన కొందరు పాత సాధకుల స్మృతులు కూడా చూపించబడతాయి. మీరందరూ ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని మా మనవి. ఇందు కొరకు ముందుగా రిజిస్టర్ చేసుకోవటం తప్పనిసరి. క్రింది పద్ధతుల్లో రిజిస్టర్ చేసుకోవాలి:

WhatsApp - 8291894644
SMS - 8291894645
Website: http://registration.globalpagoda.org/registration/

## ధర్మంలో పరిపక్వత చెందండి – వయోధికుల సమ్మేళనము

**కాలేన ధమ్మ సాకచ్ఛ** – సమయానుసారంగా ధర్మాన్ని గురించిన చర్చ ఉత్తమమైన మంగళం.

50 సంవత్సరాలు పైబడిన వారు ధర్మాన్ని అర్థం చేసుకుని, రోజువారీ దినచర్యలో దానిని ఆచరణలో పెట్టడం ఎలాగో తెలుసుకోవడానికి ఒక సమ్మేళనం నిర్వహించబడుతోంది. ఈ సమ్మేళనం, డిసెంబర్ 8 నుండి 10 వ తేదీ వరకు ధమ్మ నాగాజ్జున (నాగార్జున సాగర్)లో ఏర్పాటు చేయటమైనది. ఇందులో పాల్గొనదలచిన వారు క్రింది నంబర్లలో సంప్రదించి ముందుగా రిజిస్టర్ చేసుకోవలసి ఉంటుంది.

పురుషులు – లింగయ్య గారు (9949715401, 7382013767)

మహిళలు – సురేఖ గారు (9391639224, 6300714026)

+++


| | | |
|---|---|---|
| రెండు సంవత్సరాలకు చందా రూ 100/- | **విపశ్యన తెలుగు మానపత్రిక** | జీవిత చందా రూ. 500/- |
| ప్రచురణ తేది: ప్రతినెల 30/31 | పోస్టింగ్ తేది: ప్రతి నెల 1/2 | వెల: రూ 5/- |

**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**
**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**


If Undelivered please return to :
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam.
Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.